# పెళ్ళిచూపులు

★ గోపు శ్రీహరనాథ్ ★

ఆ వేళ ఆదివారము. రామచంద్రరావుఇంటి వసారాలో కూర్చుని అప్పుడే వచ్చిన డెయిలీ తిరగవేస్తున్నాడు. ఊరికే బల్లమీద ఖాళీ అయిన కాఫీ గ్లాసు డాన్సు చేస్తోంది. కాళ్ళు పెట్టుకోడానికి అడ్డం తీసి ఒక ప్రక్కన పెట్టాడు. ఏదో ఆలోచిస్తూ బల్ల సొరుగు లాగేడు. 'అరె! నిన్ననే వచ్చిందన్నమాట. నాతో చెప్పలేదే!' అనుకొంటూ 'లక్ష్మీ! ఇటు గా ఒకసారి!' అన్నాడు. ఆమె పూర్తి పేరు రాజ్యలక్ష్మి అయినా అతనికి 'లక్ష్మి' అని పిలవడమే అలవాటై పోయింది.

'ఏమండీ! ఎందుకు పిలిచారు' అంటూ వచ్చిందామె.

'వారపత్రిక వచ్చిందని చెప్పలేదేం!'

'మీరు ఎలాగూ చూస్తారని బల్ల సొరుగులో పెట్టాను. చూడకపోతే నేనేం చెయ్యను?' అంది.

'సరేలే! ముందీ కాఫీ గ్లాసు తియ్యి'.

గ్లాసు తీసుకొని ఆమె వెళ్ళిపోయింది. రామచంద్రరావు పత్రిక చదవడంలో పడ్డాడు. అలా చదువుతూ ఎంతసేపు ఉన్నాడో ఏమో! 'టెలిగ్రాం సార్!' అన్న కేక విని త్రుళ్ళిపడి లేచాడు. 'టైమెంతయిందోయ్' అని అడిగాడు టెలిగ్రాం తీసుకొంటూ. 'పది గంట లైందండి' అంటూ వెళ్ళిపోయాడు. కవరు చించాడు. అంతలో అక్కడికి వచ్చిన లక్ష్మి వస్తూనే 'ఎక్కడి నుంచండి టెలిగ్రాం?' అంటూ ఖంగారుగా అడిగింది.

'ఫ్రెండుదగ్గరనుంచో వచ్చి వుంటుంది. అప్పుడే అంత ఖంగా రెందుకు? మీ ఆడవాళ్ళలో ఉన్న గుణమే అంత!' అన్నాడు.

'మీ సొద అంతా సావకాశంగా వింటాను అది చూడండి తొందరగా."

టెలిగ్రాం చదువుతూనే 'నే చెప్పలేదూ. కమలాకరంగాడు ఏదో ముఖ్యమైన పని మీద వస్తున్నాడట. స్టేషనుకు గమ్మన్నాడు.

'ఏ ట్రైనుకు వస్తున్నారండీ!'

'మెయిలుకు. ఇంతకూ ఇక్కడకు మెయిలు ఎన్ని గంటలకు వస్తుంది?'

'పదకొండు గంటలకండి. త్వరగా భోంచేసి వెళ్ళండి.'

'మళ్ళీ వచ్చి, వాడూ, నేను భోంచేస్తాంలే' అని డ్రస్సు వేసుకొని స్టేషనుకు బయలుదేరేడు.

* * *

కమలాకరం, రామచంద్రరావు ఇద్దరు కలిసి మొత్తం నాలుగేళ్ళు చదివి, ఇంటరు, బి.ఏ. పూర్తి చేసేరు. ఇద్దరూ ఎంతో స్నేహంగా ఉండేవారు. వాళ్ళు చదువు పూర్తి చేసి అప్పుడే రెండేళ్ళయింది. రామచంద్రరావు బి.ఏ. అయిపోగానే హాయిగా పెళ్ళిచేసుకొని ఇక్కడ ఉద్యోగములో చేరాడు. కమలాకరం డబ్బున్నవాడు. తెలివైనవాడు. చదువుమీద శ్రద్ధ వున్నవాడు. అందుకే అతనీ రెండేళ్ళలోనూ ఎం. ఏ. పూర్తి చేసేడు. రామచంద్రరావుకూడ ఇంకా చదివి వుండేవాడే. కాని డబ్బు సర్దుబాటు లేక మానివేసేడు.

వాళ్ళు చదువుకొనే రోజుల్లో విచిత్రమైన వాదోపవాదాలు వాళ్ళమధ్య జరిగేవి: పెళ్ళివిషయంలో అవి ఉచ్ఛస్థాయి నందుకొనేవి.

'పెళ్లి చేసుకొనేటప్పుడు అన్ని విషయాలు సాధ్యమైనంతవరకు ఆమెతోనే మాట్లాడి ఆమెను సరిగా అర్థంచేసుకొని పెళ్ళిచేసుకోవడం ఉత్తమమనేవాడు' కమలాకరం.

'ఒకరిని అర్థంచేసుకోవడంకోసం వాళ్ళతోనే అన్ని విషయాలు మాట్లాడనక్కరలేదు. ముఖాన్ని చూసే మనసులో భావాలన్ని తెలుసుకోవచ్చు. కాకపోయినా ఈ కాలంలో ఈ మోసగాళ్ళయిన మొగాళ్ళతో అంత ధైర్యంగా మాట్లాడే మగువ లెవ్వరురా' అనేవాడు, కవిత్వంలో అప్పుడప్పుడు కలందూర్చి రామచంద్రరావు.

'ముఖాలనుచూసి మనుష్యులను అర్థంచేసుకోవడం ప్రతివారికి సాధ్యం కాదు! అందులోనూ ఆడవాళ్ళను అర్థంచేసుకోవడం మరీ కష్టం. వాళ్లు నివురుగప్పిన నిప్పులాంటివారు' అనేవాడు కమలాకరం.

ఇవన్నీ రామచంద్రరావు దృష్టిపథంలో ఒక్కసారి మెదిలాయి' అంతలోకే స్టేషను వచ్చేసింది. ఒక ప్లాటుఫారం టికెట్టుకొని ఎంక్వయిరీ ఆఫీసువైపు నడిచాడు.

'మెయిలు టైము ఎప్పుడండీ?' అన్నాడు. రావలసిన టైముమాత్రం పదకొండుగంటలే, కాని అరగంట లేటట. హిగ్గిన్‌బాథమ్స్ బుక్‌స్టాల్‌లో ఏవో రెండు పుస్తకాలు కొన్నాడు. అక్కడే వున్న బెంచీమీద కూర్చుని చదవడం మొదలెట్టాడు.

ట్రైను టైం అయిందని బెల్లు కొట్టారు. పోర్టర్లు అటూ ఇటూ పరుగెత్తుతున్నారు. ప్రయాణీకులు తమ సామాను రెడీగా పెట్టుకొంటున్నారు. పండ్లవాళ్లు, పేపరువాళ్లు జోరుగా తిరుగుతున్నారు. స్టేషను చాలా హడావిడిగా ఉంది.

ఇంతగందరగోళం జరుగుతున్నా ట్రైను వచ్చేవరకు రామచంద్రరావుకు ఆ సంగతి తెలియనేలేదు. 'అరె! అప్పుడేవచ్చేసిందే!' అనుకొంటూ ఒక్కొక్క పెట్టె చూస్తూ వెడుతున్నాడు. సెకండుక్లాసు పెట్టెలో నున్న కమలాకరం పెట్టె, బెడ్డింగు పోర్టరు నెత్తిమీద పెట్టాడు. అంతలోనే అక్కడికి వచ్చిన రామచంద్రరావుని చూసి, 'హల్లో! రావు! నీవు స్టేషనుకు రావు అనుకొన్నానురా! పద పోదాం!" అన్నాడు.

'ఏరా! కమలం! కులాసా?' అన్నాడు.

'ఏదో! నీ దయవల్ల!

కమలం అని పిలవడం రామచంద్రరావుకి, రావు అని పిలవడం కమలాకరంకి అలవాటు.

టాక్సీలో ఇంటికి వచ్చి, భోజనాలు పూర్తిచేసేటప్పటికి ఒంటిగంట అయింది.

"ఒరే! కమలం! రోజూ పదింటికయ్యే భోజనం నీ పుణ్యమా అని ఇప్పటికి అయిందిరా!' అన్నాడు.

'నిన్నసలు భోజనం చేయకుండా ఎవరు రమ్మన్నార్రా? భోజనంచేసి ఏడవలేకపోయ్యావు?'

'భోజనంచేసివస్తే నీవు ఏడుస్తావేమోఅని. సరేలే కాస్సేపు పడుకో' అని పక్క వేసేను.

రామచంద్రరావు మూడు గంటలకే లేచి కాఫీతయారు చేయించాడు. అప్పటికి కమలాకరం మంచినిద్రలో ఉన్నాడు. లేపడమెందుకని ఊరుకొన్నాడు. కమలాకరం లేచి కాఫీ పూర్తిచేసేటప్పటికి నాలుగైంది.

'ఒరేయ్! తొందరగా ముఖం కడుక్కోరా! బజారుకెళదాం' అన్నాడు రామచంద్రరావు.

'నేను స్నానం చేయాలి. ఆలస్యం అవుతుంది' అన్నాడు.

'అయితే స్నానంచేసి రెడీగా వుండు. నేనూ, లక్ష్మి వెళ్లి వచ్చేస్తాము. సాయంత్రం సినిమా కెళదాం' అని బజారు కెళ్ళారు రామచంద్రరావు దంపతులు.

కమలాకరం సావకాశంగా లేచి స్నానం చేశాడు. ఫుల్ పాంటు, ఫుల్ షర్టు వేసి టక్ చేసుకొన్నాడు. పెద్దఅద్దం ఒకటి గుమ్మానికెదురుగా ఉంది. గుమ్మందగ్గరకు ఎవరువచ్చినా అద్దంలో స్పష్టంగా కనపడతారు. టై కట్టుకుంటూ ఏదో, హుషారుగా 'రావో రావో ప్రియతమా' అంటూ పాట పాడుతున్నాడు. ఎవరో గబగబా పరుగెత్తుకొని వచ్చి గుమ్మందగ్గరే ఆగిపోయారు. వెనక్కి తిరిగిచూసేటప్పటికి ఒక పదిహేడేళ్ళ అమ్మాయి 'మీ రెవరో'న్నట్లు ఆశ్చర్యంగా చూస్తూ గుమ్మందగ్గరే నిలబడివుండిపోయింది. అందం, ఆకర్షణ తగుపాళ్ళలో మిళితమై కళకళలాడే ముఖము, గుండ్రని కళ్లు, పిరుదులవరకు వ్రేలాడే అందమైన జుట్టు, భారతీయ సాంప్రదాయాన్ని చాటే ఎఱ్ఱని బొట్టూ—ఇవన్నీ ఆమె అందాన్ని ద్విగుణీకృతం చేస్తున్నాయి. లేతగులాబీ చీర, ఆకుపచ్చని వెల్వెట్టు జాకెట్టు ఆమె చామన చాయ శరీరానికి ఎంతో వింతసొయగాన్నిస్తున్నాయి.

ఏమి ఆలోచన తట్టిందో ఏమో చటుక్కున ఇంకోవైపు తిరిగి జేబులో ఫోటో నొకసారి చూచుకొన్నాడు. చాల ఆశ్చర్య పడ్డాడు. అప్పుడు జ్ఞాపకమొచ్చిందతనికి. ఆ అమ్మాయిని కూర్చోమని అయినా అనలేదని.

కుర్చీ చూపించి, 'కుర్చీలో కూర్చోండి'. ఎవరు కావాలండీ?' అన్నాడు.

ఆ అమ్మాయి తడబడుతూ రెండడుగులు ముందుకు వేసి 'రాజ్యలక్ష్మిగారు కావాలండి' అంది.

'బజారుకు ఏదో పనుండి వెళ్ళారు. కూర్చోండి ఇప్పుడే వస్తారు' అన్నాడు కమలాకరం. పెద్దవాళ్ళ ఎదురుగా కూర్చొనకూడదనో ఏమో, ఆమె మాత్రం అలా నిలబడేవుంది.

'కూర్చోండి, ఫరవాలేదు' అన్నాడు. అప్పటికి ఆమె భయపడుతూనే కూర్చుంది.

కమలాకరం బూటు తొడుక్కొంటూ 'ఎవరమ్మాయండి మీరు' అన్నాడు.

ఆమె వినయంగా 'అడ్వొకేటు శోభనరావుగారమ్మాయినండి' అంది.

'మీ పేరు?'

'సంధ్య...మీ పేరు?' కొంచెం జంకుతూనే అడిగింది.

'కమలాకరం.'

'ఎంతవరకు చదివారండీ?'

'ఆ! ఏదో ఎం. ఏ. ప్యాసయ్యాను.'

'ఎం. ఏ. ప్యాసయికూడా ఇంకా ఏదో అంటారేమండీ?'


'ఏం ప్యాసయినా ఉద్యోగాలుమాత్రం కరువేకదండీ మన దేశంలో.'

'ఎంత ఉద్యోగాలు కరువయినా ఎం. ఏ. చదివినవారికి ఆమాత్రం ఉద్యోగాలే ఉండవటండీ?'

'మీకు పెళ్లి యిందాండీ?'

'లేదండి' అంటూ ఎంతో సిగ్గుతో ముఖం దించేసుకొంది.

'ఏమిటో! ఆడవారి మనస్తత్వం. ఎంత

# ★ పెళ్లిచూపులు ★

సరదాగా మాట్లాడినా పెళ్ళిమాట వినేసరికి ఎంతో సిగ్గుపడుతూంటారు' అనుకొంటూ మళ్ళీ సంభాషణలో పడ్డారు.

'ఏదో పొరపాటున అలా అడిగేను. ఏమనుకోకండి' అన్నాడు.

'పర్వాలేదండి' అని ఆమె అన్నా సిగ్గు దొంతరలు ఆమె ముఖంలో దాగుడుమూతలాడుతున్నాయని, స్పష్టంగా తెలుస్తోంది.

కమలాకరం "ఇంతకీ (ఫీ యూనివర్సిటీలో మీ గ్రూపు ఏమిటండీ?" అని అడిగాడు.

'బి. పి. సి.'

'అంటే బొమ్మలు వేయడం బాగా చేతవునన్న మాట.'

'కొంచెంగా వచ్చునండి'

'రాజ్యలక్ష్మి గారికి మీరు బంధువులా? స్నేహితులా?'

'స్నేహితులమేనండి! ఏదో సినిమాలో కలుసుకొన్నాం. అప్పటినుండీ స్నేహం.'

'మనసువిప్పి మాట్లాడే స్నేహితులతో మాట్లాడటమంటే నాకు ఎంతో సర్దాగా ఉంటుందండి, అటువంటివాళ్ళతో ఎంతసేపైనా బాతాఖానీ కొట్టబుద్ధి వేస్తుందండి.'

'నాకూ అలాగే వుంటుందండి. ఆడవాళ్ళతోనైనా మగవాళ్ళతోనైనా కొంతమందిని చూడండి. మాట్లాడితేనే తమ గౌరవం ఏదో పోయినట్లుగా బాధపడ్తారు' అంది సంధ్య.

'మీరు కాలేజీలో నాటకాలు మొదలైనవాటిలో ఎప్పుడైనా పాల్గొనేవారా?'

'నాటకాల్లో పాల్గొనలేదండి. కాని ఒకటి రెండుసార్లు మా కాలేజీ స్టేజీమీద పాటలుమాత్రం పాడేవండి.'

'అయితే మీకు పాటలుకూడా వచ్చునన్నమాట'

'ఏదో! స్నేహితుల బలవంతంమీద పాడేవండి'

'ఒక విషయము అడుగుతాను. మీరు బాధపడరుగదా.'

'అడగండి! పర్వాలేదు' అంటూ హామీ ఇచ్చింది సంధ్య.

'ఇంతవరకూ మీ రెవరినైనా ప్రేమించడం జరిగిందా?'

'ఇంతవరకూ లేదండి' అంది 'ఇంతవరకూ' అన్న మాట నొక్కి పలుకుతూ.

'ఇక ముందు జరుగుతుందనుకోవచ్చా?'

'ఏమో! ఎలా జరుగుతుందో ఎవరికి తెలుసండీ!'

'ప్రేమంటే మీ అభిప్రాయం?'

'ఒకరిపై ఒకరికి కలిగే విశ్వాసము లేక నమ్మకనే ప్రేమంటారనుకొంటాను ఇది నా అభిప్రాయము మాత్రమే సుమండీ!'

అంతటితో ఆ సంభాషణ ఆపు చేద్దాం అనే ఉద్దేశ్యంతో 'నా అభిప్రాయమూ అదే ననుకోండి...అప్పుడే ఆరుగంటలైంది. అయినా వీళ్ళు రాలేదు. ఇచట సినిమాలు ఎన్నింటికి మొదలుపెడ్తారండీ?' అని అడిగాడు కమలాకరం.

'ఆరున్నరకండి. సినిమా ప్రోగ్రాం ఉందేమిటండీ?'

'ఔనండీ. మా రావువెళ్దాం రెడీగా వుండమన్నాడు.'

అంతలోనే ఊడిపడ్డా రిద్దరు. 'ఏమిటోయ్! పావకాలంగా మాట్లాడుతున్నారు.' అప్పటికే సంధ్య రాజ్యలక్ష్మితో వంటింటిలోనికి వెళ్ళిపోయింది.

'అబ్బే! ఏమీ లేదు. ఆ అమ్మాయి మీ శ్రీమతికోసం వచ్చింది. మీ రొచ్చేవరకు మాట్లాడుకున్నాను.' అన్నాడు కమలాకరం.



**కీ॥ శే॥ డి. వి. సుబ్బారావు**

నటరాజశేఖర శ్రీ డి. వి. సుబ్బారావు ఈ నెల 7 వ తేదీన బందరులో స్వర్గస్థులయ్యారు. వీరి వయస్సు 66 సం॥. హరిశ్చంద్ర, వింధ్యరాణి, బొబ్బిలి మొదలైన నాటకాలలో అత్యుత్తమ నటనా స్థాయిని ప్రదర్శించి, ఆంధ్ర రసిక హృదయాలను చూరగొన్న వీరి మృతితో ఉజ్జ్వలమైన ఒక నాటక తరానికి చెందిన మరొక తార రాలిపోయింది. దుఃఖసాగరంలో మునిగిన వీరి కుటుంబానికి మా సానుభూతి.

సంధ్య లోపలినుండి వస్తూ, 'రామచంద్రరావుగారూ! మా నాన్నగారు మిమ్మల్ని, మీ శ్రీమతిని రేపు 8 గంటలకు తప్పకుండా రమ్మన్నారు.'

'ఎందుకూ' అన్నాడు మధ్యలో రామచంద్రరావు.

'అది మీ శ్రీమతిని అడగండి. వెళ్ళొస్తానండి కమలాకరంగారూ!' అంటూ సమాధానానికి ఎగురు చూడకుండా వెళ్ళిపోయింది పరుగెత్తుకుంటూ——

'చూశావురా! ముందొచ్చిన చెవులకంటే వెనకొచ్చిన కొమ్ములవాడి అంటారు, అలాగ మాతో చెప్పకుండా నీతో చెప్పిందివెళ్ళొస్తానని' అన్నాడు రామచంద్రరావు.

'మీతో చెప్పకపోయినా నాతో చెప్పిందిలెండి. సినిమాకు టైమయింది పదండి' అంది రాజ్యలక్ష్మి అప్పుడే లోపలినుండివస్తూ.

'ఇంతకూ రేపుఎందుకు రమ్మన్నట్లు!'

'ఆ అమ్మాయిని పెళ్లిచూపులు చూడటానికి ఎవరోవస్తున్నారట! అందుకు'

ముగ్గురూ సినిమాహాలు వైపు నడిచారు.

* * *

తెల్లవారింది. అప్పుడే $7\frac{1}{2}$ గంటలు కావస్తోంది. బహుబద్ధకస్తుడు కమలాకరం, ఇంకా లేవనేలేదు.

'ఒరే! కమలం! అప్పుడే $7\frac{1}{2}$ అయింది లేవరా!' అన్నాడు రామచంద్రరావు. లేచిన కమలాకరం కాలకృత్యాలు, కాఫీ టిఫిన్లు పూర్తిచేసేటప్పటికి 8 గంటలైంది.

'కమలం! మేము శోభనరావు గారింటికి వెళ్ళాలి. నువుఉంటావుగా! పదిగంటలకల్లా వచ్చేస్తాం!' అన్నాడు రామచంద్రరావు.

'నాకూ పనుందిరా' తాళం ఇచ్చి వెళ్ళండి' అన్నాడు.

* * *

వాళ్ళు శోభనరావుగారింటికి వెళ్ళారు. శోభనరావు గారు బయటఉండగానే, 'రండి! రండి! మీ కోసమే చూస్తున్నాం' అన్నారు ఆప్యాయత ఉట్టిపడేలా.

లక్ష్మి లోపలికెళ్లింది. రామచంద్రరావు, శోభనరావు బయటగదిలో కూర్చున్నారు.

'ఏమిటండీ సంగతులు? అబ్బాయి గురించి ఏమి భోగట్టా చేశారు?' అన్నాడు రామచంద్రరావు.

'ఆ అబ్బాయిని మాత్రం చూశాను. బాగానే ఉంటాడు నెమ్మదస్తుడు. ఆ వేళ అతనేదో ఊరు వెళుతున్నాడు. అతనితో మాట్లాడడం పడలేదు. వాళ్ళ నాన్నగా చెప్పారు. ఆ అబ్బాయి తనకు కావలసిన సంగతులన్నీ అమ్మాయినడిగే తెలుసుకుంటాడట. అమ్మాయికూడ ఏమైనా అడగదల్చుకొంటే అడగవచ్చునట!

'నేను చదువుకొనేటప్పుడు మా స్నేహితు

డొకడు అలాగే వాదించే వాడండి. అన్ని సంగతులు పెళ్ళి చేసుకోబోయే అమ్మాయి నే అడగాలని. వాడిప్పుడు ఏదో పనిమీద ఇక్కడకు వచ్చాడు.'

'ఇన్ని వరతులు పెట్టినతర్వాత నేనూ ఒక విషయము చెప్పేను. అమ్మాయి నచ్చినది లేనిదీ చూసి వెళ్ళబోయే ముందే చెప్పాలన్నాను. తర్వాత ఇంటికివెళ్ళి ఉత్తరాలు వ్రాస్తాననడం. అవీ కుదరవన్నాను. ఆయన అబ్బాయినడిగి చెప్తానన్నారు. తర్వాత ఉత్తరం వ్రాశారు—ఆ అబ్బాయి నే పెట్టిన షరతుకు ఒప్పుకున్నట్లు ఇవాళ 9 గంటలకు పెళ్ళిచూపులకు వస్తాడన్నట్లు—చాలా బుద్ధిమంతుడని తెలిసిందనుకోండి. ఆ అమ్మాయికి అబ్బాయి, ఆయనకి అమ్మాయి నచ్చితే వెంటనే పెళ్ళి చేసేస్తాను' అన్నారు.

ఈ సంభాషణ ఇలా సాగుతూ వుంది.

*   *   *

ఇంట్లోకి వెళ్ళినలక్ష్మి తిన్నగా సంధ్య గదిలోకి వెళ్ళింది. ఆమె అప్పుడే ముస్తాబు అవడం మొదలు పెడుతోంది. ఆమె తల్లిగారు సవరిస్తూ చీర జాకెట్టు అక్కడ పెట్టి 'లక్ష్మిగారూ! కొంచెం అమ్మాయి ముస్తాబు చూడండి. నేనిప్పుడే వంటపని చూస్తాను అన్నారు.'

'అలాగేనండి' అంది లక్ష్మి.

'సంధ్యా! పెళ్ళికొడుకు గారు నిన్ను చూడడంతోటే ముగ్ధుడైపోవాలన్న మాట. అలా తయారు కావాలి' అంది లక్ష్మి.

'మీరేగా ముస్తాబు చేస్తున్నారు. ఎలా చేస్తారో మీ ఇష్టం.'

జడలో పువ్వులు పెడుతూన్న లక్ష్మి 'సంధ్యా! ఒకసారి ఆ వచ్చే ఆయన ఫొటో చూపించుదూ' అని అడిగింది.

'మా నాన్నగారు నా ఫొటో ఇచ్చేరు కాని...ఆయన ఫొటో తీసుకు రాలేదండీ. సరే కానండీ! నిన్న మీ ఇంటికి వచ్చిన ఆయన ఎవరండీ? చాల సర్దాగా గౌరవంగా మాట్లాడేరు.'

'ఆయన మా ఆయన స్నేహితుడట. చాల మంచివాడూ, నెమ్మదస్తుడూనట. ఏదో పని మీద ఇక్కడకు వచ్చాడు. నిన్న ఆయనతో మాట్లాడేవు కదా! మళ్ళీ ఎందుకడిగావు?' అని ఎదురుప్రశ్న వేసింది.


'అబ్బే! ఏమీ లేదండి. అసలు తెలుసుకుందామని.

'నీవు గాని ఆయన వచ్చారేమిటి?'

'అబ్బెబ్బే! లేదండి' అంటూ నసిగింది సంధ్య.

ఆ నసుగుడులో అర్థం కనిపెట్టిన రాజ్యలక్ష్మి సంధ్యను నొక్కి నొక్కి అడిగింది. వచ్చినట్లుగా చెప్పింది.

'కాని ఇప్పుడాయన్ని గురించి ఆలోచించడం ఎలా కుదురుతుందండి? 9 గంటలకు ఎవరో వస్తున్నారు గదా!' అంది సంధ్య.




'ఎవరు వచ్చినా, ఆ వచ్చినాయనకు వచ్చాలిగా అయినా.'

ఆ సంభాషణకు అంతలో బ్రేకు పడింది. 'ముస్తాబు పూర్తయిందా' అంటూ సంధ్య అమ్మగారు అక్కడకు వచ్చారు.

కమలాకరం నీటుగా డ్రస్సు వేసుకొన్నాడు. తెల్లటి షర్టు, బూడిద రంగు ఫేంటుమీద టక్ చేసి, టై ఒకటి కట్టుకొని కోటు వేసుకున్నాడు. నైలాన్ సాక్సుతో నల్లటి బూటు వేసుకొని కూలింగ్ గ్లాస్ కళ్ళజోడు పెట్టుకొని టిప్‌టాప్‌గా తయారయ్యాడు. ఒకటికిపదిసార్లు అద్దంలో చూసుకొని గదికి తాళం వేసి బయలుదేరేడు.

రోడ్డుమీదకు వచ్చాడు. అప్పుడే టైము పావుతక్కువ తొమ్మిది అయింది. అలా వెళ్తే ఆటోరిక్షా కేకేసి 'ఫలానావారిల్లు తెలుసా' అన్నాడు. 'తెలుసునండి!' అన్నాడు డ్రైవరు. ముందుగానే అయిదురూపాయల నోటుఇచ్చేసి నన్నక్కడ దింపేసి నీవు వెళ్ళిపోవచ్చు' అన్నాడు. ఆటోరిక్షా సాగిపోతోంది.

అది ఆ వీధిలో రెండంతస్తుల మేడదగ్గర ఆగింది. కమలాకరం దిగాడు. రిక్షా వెళ్ళిపోయింది. కిటికీలోంచి చూసిన శోభనరావుగారు గబగబా బయటికి వచ్చి "రండి, మీకోసమే చూస్తున్నాం." అంటూ ఆహ్వానించారు. "ఇలా వచ్చేవేమిరా కమలం, నాకోసమేనా?" అనబోయే రామచంద్రరావు నోటికి తాళం పడింది. అంతలోనే "వీరేనండి" అంటూ శోభనరావుగారు రామచంద్రరావుకి పరిచయం చేయబోయారు.

"వీరేనాండీ! వీడు నే చెప్పిన స్నేహితుడేనండి" అన్నాడు ఆశ్చర్యపోయిన రామచంద్రరావు. కమలాకరాన్ని ఒక గదిలో సోఫాలో కూర్చోబెట్టారు. ఆ గది కొంచెం ప్రత్యేకంగా అలంకరించినట్టుగానే వుంది. అప్పటికి సరిగ్గా 9 గంటలైంది.

శోభనరావుగారు ఖంగారుగా అమ్మాయిని ముస్తాబు అవమంటున్నారు. టిఫిన్, కాఫీ అన్నీ కమలాకరానికి ఏర్పాటు చేశారు. ఏమీ తీసుకోకపోవడం బావుండదని ఒక కాఫీ మాత్రమే తీసుకొన్నాడు. అదైనా శోభనరావుగారి బలవంతం మీద.

సంధ్యను తీసుకురమ్మన్నారు. రాజ్యలక్ష్మిగారు తీసుకువస్తూనే ముందు రామచంద్రరావును చూశారు. ఆయన కమలాకరం వైపు చూపించారు. ఒక్కసారిగా ఆశ్చర్యపోయిందావిడ. 'నీ కోరిక నెరవేరింది. నీకు కావలసిన మొగుడే' అన్నారు రాజ్యలక్ష్మి సంధ్య చెవిలో. ఆ మాటలు నమ్మలేక నిజం తెల్సుకుందామనో ఏమో తక్కువ బ్రుపత్తి కమలాకరంవైపు చూచింది. అప్పటికే కమలాకరం చిరునవ్వు నవ్వుతూ చూస్తున్నాడు. ఈ సంఘటన అందరూ చూస్తున్నారన్న తలపు రాగానే అంత ధైర్యంగా చూచిన సంధ్య సిగ్గుతో తల దించేసుకొంది. సంధ్యను కమలాకరంకి ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చోబెట్టారు.

ఎంతో బలవంతంమీద ఇంకోసారి ముఖం చూపించేరు, శోభనరావుగారు. "మీరు అడుగదలచిన ప్రశ్నలు అడగవచ్చు" అన్నారు.

(55 వ పేజీ చూడండి)

# ★ పెళ్ళిచూపులు ★

(15-వ పేజీ తరువాయి)

'ఏమండీ! సంధ్యగారూ! నన్ను పెళ్ళి చేసుకోవడం మీ కిష్టమేనా?' అని అడిగాడు కమలాకరం.

ఇష్టమే నన్నట్లుగా తల వూపింది.

'ఇక ఏమీ అడగక్కర లేదండి. మీ అమ్మాయి ఏమైనా అడగదలచుకొంటే అడగవచ్చు' అన్నాడు కమలాకరం.

అమ్మాయిని ప్రశ్నలు అడగడం ఖచ్చితంగా జరగాలన్న కమలాకరం ప్రశ్నలు అడగవలసినవి ఏమీ లేవనటం విన్న శోభనరావుగారు, రామచంద్రరావు ఆశ్చర్యపడకుండా ఉండలేకపోయారు. రాజ్యలక్ష్మిగారు మాత్రం 'వీళ్ళ సంభాషణ చాలసేపు జరిగిందన్నమాట' అనుకొన్నారు.

'అమ్మాయ్! సంధ్యా నీ వడగదల్చుకొన్న ప్రశ్నలు ఏమైనా ఉన్నాయా?' అన్నారు శోభనరావుగారు. ఏమీ లేవన్నట్లుగా తలకాయ ఊపింది.

అనుమానం వదలని శోభనరావుగారు—

'పాట ఏదైనా పాడించమంటారా?' అని అడిగారు.

'అక్కరలేదండి' అన్నాడు కమలాకరం.

'అయితే అమ్మాయిగురించి మీ అభిప్రాయం?'

'నచ్చిందండి. ముహూర్తము పెట్టడానికి మా నాన్నగారిని పంపిస్తాను. మీరూ వారూ ఆలోచించుకొని మిగతా విషయాలు పూర్తి చేయవచ్చు' అంటూ లేచాడు.

సిగ్గుతో ఎర్రగులాబీలగా తయారైన సంధ్య చెక్కిళ్ళు చూస్తూ బయటికి నడిచాడు. గేటువరకు శోభనరావుగారు వచ్చారు. ఆటోరిక్షాను పిలిచారు.

కమలాకరం రిక్షాలో కూర్చుంటూ "నువ్వూ రారా! రావూ?' అన్నాడు.

'వెళ్ళొస్తానండి' అని శోభనరావుగారి వద్ద శెలవు తీసుకొని రిక్షా ఎక్కాడు రామచంద్రరావు.

ఇద్దరి దగ్గరా శెలవు తీసుకొన్న శోభనరావుగారు కాబోయే అల్లుడి మనస్తత్వానికి నవ్వుకుంటూనే ఇంటిలోనికి నిష్క్రమించారు.

రిక్షాలో బయలుదేరిన రామచంద్రరావు 'ఏరా! కమలం! నాతో మాట మాత్రంగానైనా చెప్పలేదేరా?' అని అడిగాడు.

'ఎందుకిక్కడకు వచ్చిందీ అసలు నీవేమైనా అడిగేవురా?' అని ఎదురుప్రశ్న వేశాడు కమలాకరం.

'ఏడవలేకపోయావు—సరేకాని. ఏవేవో ప్రశ్నలడుగుతానని చెప్పావట. ఏమీ అడగలేదేం?'

'అడగవలసినవన్నీ మీ ఇంటిదగ్గరే అయిపోయాయి.'

'అయితే ముందు పెళ్ళిచూపులు మా యింటిలోనే అయ్యాయన్నమాట.' అన్నాడు రామచంద్రరావు. అప్పటికే ఇద్దరూ ఇల్లు చేరారు.

రాజ్యలక్ష్మిగారు వెళుతూ, 'సంధ్యా! సాయంత్రం మాయింటికి ఒకసారి రావమ్మా' అంది.

'ఏమనుకుంటారేమో!' అంది సంధ్య.

"అనుకొంటే యేం. కావలసినవారేగా! అయినా ఆయన 2 గంటలకు మెయిల్ లో వెళ్ళిపోతారు. నువు సాయంత్రం 4 గంటకు రా' అంది.

ఇంతలో సంధ్య అమ్మగారు వచ్చారు. చేసినసహాయానికి ఎన్నో కృతజ్ఞతలర్పించారు.

రాజ్యలక్ష్మిగారు, 'మేము చేసిందేముందండి—మీ అమ్మాయిని సాయంత్రం మా యింటికి పంపండి' అంది.

"అలాగేనండి"

శెలవుతీసుకొని రాజ్యలక్ష్మిగారు మెల్లగా 10 గంటలకు ఇంటికి చేరారు.

భోజనాలు పూర్తయేయి. కమలాకరం దగ్గరలేకుండా చూసి రాజ్యలక్ష్మి రామచంద్రరావు చెవిలో ఒక రహస్యం ఊదింది. "భలేభలే" అన్నాడు అతను.

"మెయిలుకు వెళ్ళిపోతావ్రా" అన్నాడు కమలాకరం.

"ఏడ్చేవు." అక్కడకెళ్ళి ఏడ్చేదేముందేమిటి? రేపొద్దున్న జనతాకెళుదువుగాని. సరిగ్గా భోజనాలవేళకు ఇంటికి వెళ్తావు' అన్నాడు.

"నిన్న వచ్చి అప్పుడే వెళ్ళిపోవడమేమిటండీ" అంది రాజ్యలక్ష్మి. ఎలాఅయితేనేం కమలాకరాన్ని ఆవేళకి ఆపివేశారు.

4 గంటలైంది. సంధ్య అప్పుడేవచ్చింది. రాజ్యలక్ష్మి ఫలహారం తయారు చేసింది. టేబులుకు అటురెండు, ఇటురెండు కుర్చీలు వేశారు. రాజ్యలక్ష్మి, రామచంద్రరావు ఒకవైపున కూర్చున్నారు. రెండవవైపున సంధ్యను కూర్చోపెట్టారు. ఇంకో కుర్చీ ఎందుకు వుంచారో సంధ్యకు తెలియలేదు. ఎందుకంటే అంతవరకు కమలాకరం ఆమెకు కనబడలేదు. అప్పుడే కమలాకరం చేతులు తుడుచుకొంటూ గుమ్మందగ్గరకొచ్చి ఆగిపోయాడు. ఆగుమ్మం సంధ్య కూర్చున్న వెనుకవైపువుంది. కమలాకరం రావడం ఆమె చూడలేదు. 'రారా కమలం' అన్న రామచంద్రరావు మాటలు విని వెనక్కి చూసి ఉలిక్కిపడి భంగున వంటగదిలోకి పరుగెత్తింది. ఒక కుర్చీలో కమలాకరం కూర్చున్నాడు. రాజ్యలక్ష్మిగారు ఆమెని బలవంతాన తీసుకొచ్చి కమలాకరం ప్రక్కన కూర్చోపెట్టారు. సంధ్య సిగ్గుతో ముడుచుకుపోయింది. ఆగది నవ్వుల ప్రతిధ్వనులతో నిండిపోయింది. ★

---

...చారు రచయిత్రిగారు. వారికి నా ధన్యవాదాలు. ఇటువంటి శీర్షికలే యింకా కల్పించి సంఘంలో ఉండే క్రుళ్ళునుయెత్తి చూపుతూ, పాఠకుల అభిమానాలు చూరగొంటారనుకొంటాను.

ఇట్లు
పుల్లాది మోహన్,
పెద్ద గోర్పాడు.

## తెలిసినవారు

"వెజిటబుల్, వెజిటేరియన్, పులావు", "సూపు" ఆంధ్ర పత్రిక ద్వారాఎవరైనా తెలుపవలెను.

పి. లక్ష్మి,
జబల్ పూర్.

## ఓయాసిస్

గడచిన అక్టోబరునుంచీ నేను బాపట్ల వదలి అహమ్మదాబాదులో ఉద్యోగం చేస్తూ, ఒంటరిగా ఉంటున్నాను. దాక్షిణాత్యులెవరైనా కనిపించినా, తెలుగులో ఏదైనా కనిపించినా ప్రాణంలేచి వస్తుంది. ఇలాంటి పరిస్థితిలో మొన్న మీ ఆంధ్ర వారపత్రిక ఆఫీసుకి వచ్చేసరికి, ఆఫీసుపని మానేసి గబగబా చదివేశాను. నాకే ఇలాఉంటే చిరకాల ప్రవాసాంధ్రులకెలా ఉంటుందో. "జననీ జన్మభూమిశ్చ" (30-12-59) అనే స్కెచ్ ఈ పరిస్థితిలో చదివి చాలా సంతోషించాను. నాకు మీ పత్రిక ఎడారిలోని ఓయాసిస్ అనుకోండి.

మాధవపెద్ది రామకృష్ణ,
అహమ్మదాబాదు.

* * *

ది 16-12-59 తేది ఆంధ్ర-సచిత్ర వారపత్రికలో "హరివంశము" చదువుతూ ఉండగా, మా ఎదురింటి ముసలమ్మగారు విని, మర్నాడు ఒక అరడజను మందిని వెంట పెట్టుకొని మా యింటికివచ్చి, నిన్న చదివిన కథ మరల చదవమన్నారు. ఈ విధంగా అది మొదలు వారపత్రిక వచ్చేసరికి వాళ్లు రావడం, నేను చదవడం పరిపాటి అయిపోయింది. పవిత్రమైన పరమాత్ముని పుణ్యగాథ పరమానందంగా ఉంది. హరివంశము అందరికీ ఆనందంగా ఉందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

ఇవటూరి రాజశ్రీ,
అయితంపూడి. ★